# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 18 । జనవరి । 2025






**కమిషనర్‌కు తప్పిన ప్రమాదం**

ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కారుకు శుక్రవారం ప్రమాదం జరిగింది. ఆయన సురక్షితంగా బయటపడ్డారు. IIలో



**దొంగల దోపు ఉత్సవం**

భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం దొంగల దోపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. IIలో

గరిష్టం / కనిష్టం
30° / 15°

**వాతావరణం**

జిల్లాలో శనివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

## న్యూస్‌రీల్

### పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతం అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

### సింగరేణిలో అకౌంట్ ఆఫీసర్ల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న 23 మంది అకౌంట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలోముగ్గురు డీవైఎఫ్ఎంలు, ఒక సీనియర్ అకౌంట్ ఆఫీసర్, ఇద్దరు అకౌంట్ ఆఫీసర్లు, ఒకరు జూనియర్ అకౌంట్ ఆఫీసర్, 16 మంది ట్రైనీ అధికారులు ఉన్నారు. ఈ నెల 27 లోపు కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

### టీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్(టీజీటీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ గణేష్ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. నాగరికతకు దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత గిరిజన తండాల్లో, గూడేల్లో విద్య వ్యాప్తి జరిగిందని అన్నారు. జీఓ నంబర్ 3 ద్వారా వేల మంది గిరిజనులు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. కానీ ఆ జీఓను సుప్రీం కోర్టు కొట్టేయడంతో ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఏజెన్సీ ప్రాంత హక్కుల పరిరక్షణకు ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్) ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాలోత్ రామారావు, భూక్య శంకర్ నాయక్, మాలోత్ బిచ్చ నాయక్, జాదవ్ కపిల్ కుమార్, జాదవ్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

### కార్పొరేషన్ వద్దంటూ గవర్నర్‌కు వినతి



రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు గిరిజన సంఘాల జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గవర్నర్ కార్యాలయంలో గవర్నర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేనా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో గిరిజన హక్కులు, చట్టాలకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ ఏజెన్సీ విషయమై కోర్టులో కేసు నడుస్తున్నా కార్పొరేషన్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బానోతు హుస్సేన్‌నాయక్, బడిసా బిక్షం, రాములు నాయక్, సపావత్ బాలకృష్ణ, బట్టు కృష్ణ, బట్టు వీరన్న, జురుపుల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ రామయ్య!



భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సేవలన్నీ డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతోపాటు భక్తుల ఆదరణ పెంచేందుకు ఆన్‌లైన్ సేవలు విస్తరిస్తున్నారు. తాజాగా రామాలయ యాప్ రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇది అందుబాటులోకి వస్తే స్వామివారి సమస్త సమాచారం, సేవల వివరాలు స్మార్ట్‌ఫోన్ల ద్వారా పొందగలుగుతారు. – భద్రాచలం

**శ్రీ సీతారామ చంద్రస్వామి సేవలన్నీ ఆన్‌లైన్..**

- సమాచారం, అన్ని సేవల వివరాలతో యాప్‌నకు శ్రీకారం
- భక్తులకు సౌకర్యవంతం.. ఆలయానికి ఆదాయం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన ఈఓ రమాదేవి

**ప్రొటోకాల్ సేవలు, అన్నదానం టికెట్లు కూడా..**

నిత్యాన్నదాన టికెట్లను భక్తులకు పంపిణీ చేయడంలో ఉన్న లోటుపాట్లను కూడా సరిచేశారు. గతంలో టోకెన్లు ఇవ్వగా, ప్రస్తుతం ఆలయంలోనే భక్తుడి ఫొటోతో కూడిన కంప్యూటరైజ్డ్ టికెట్ ఇస్తున్నారు. ఆదాయం పెంచేందుకు ప్రొటోకాల్ సేవలను సైతం ఆన్‌లైన్‌కు అనుసంధానం చేశారు. సిఫార్సుల లేఖల ద్వారా వచ్చిన వారి ఫొటోలను తీసి దర్శనాలకు, ఇతర ఆర్జిత సేవలకు టికెట్లను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. తద్వారా మధ్యవర్తులు, సిబ్బంది చేతి వాటం లేకుండా ప్రొటోకాల్ సేవలు అందుతున్నాయి. తాజాగా దేవస్థానంలో స్వామివారి వస్త్రాలను ఇష్టానురీతి ధరలకు విక్రయించకుండా బార్‌కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. తద్వారా స్వామివారి వస్త్రాలను పొందాలనుకునే వారికి, అందచేసిన వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టారు.

**సేవలు సులభతరం**

దేవస్థానంలో రికార్డుల ప్రకారం జరుగుతున్న సేవల్లో పారదర్శకత లోపించడంతోపాటు ఉద్యోగుల చేతివాటంతో ఆలయ ఆదాయానికి భారీగా గండి పడేది. ఈఓగా రమాదేవి బాధ్యతలు చేపట్టాక ప్రక్షాళనలో భాగంగా ఆన్‌లైన్ సేవలపై దృష్టి సారించారు. రామాలయ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఆలయ సమస్త సమాచారం, సేవలు, వసతి గృహాల సమాచారం సైట్‌లో పొందుపరిచారు. కాటేజీలు, వసతులు పూర్తిగా ఆన్‌లైన్ కావడంతో భక్తులకు సేవలు సులభతరమయ్యాయి. ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. లడ్డూ కౌంటర్లు, విక్రయాల్లో అవకతవకలను నిరోధించేందుకు టికెట్లను కంప్యూటరైజ్డ్ చేశారు. నిత్యాన్నదానం, గోశాలకు విరాళాలు ఇచ్చే వారి వివరాలు నమోదు, రశీదు పంపిణీని సైతం కంప్యూటరీకరించారు.

**మెరుగుపడుతున్న ఆదాయం**

దేవస్థానం సన్నిధిలో జరిగే ప్రధాన ఉత్సవాలైన శ్రీరామనవమి, ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం రోజుల్లో టికెట్లు, వసతి గృహాలను పొందాలంటే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చేది. దీనిని పరిష్కరించేందుకు రెండేళ్లుగా టికెట్లను ఆన్‌లైన్‌లో విక్రయిస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ ఏడాది ఉత్తర ద్వార దర్శనం టికెట్లు పూర్తిస్థాయిలో అమ్ముడుపోవడమే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. దీంతో కేవలం టికెట్ల ద్వారానే రూ.35 లక్షల ఆదాయం సమకూరింది. పరోక్ష సేవలనూ ఆన్‌లైన్ ద్వారా అందజేశారు. ఇక ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఆలయ సమస్త ఆదాయంతో పాటు హుండీ ఆదాయం కూడా మెరుగుపడింది. నెలకు ఆలయ రాబడి సుమారు రూ. కోటికి చేరింది. కరోనా సమయంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులతో బ్యాంకులో రూ.6 కోట్ల విలువైన బాండ్లను రద్దు చేశారు. ఇప్పుడా మొత్తాన్ని తిరిగి జమ చేయడం విశేషం.

**యాప్‌లోనే సమస్తం**

ప్రస్తుతం సమస్త సమచారం స్మార్ట్ ఫోన్లలో లభిస్తుండటంతో రామాలయ సేవలను సైతం యాప్ ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఆలయ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం, ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ సేవలు ఇదే యాప్‌లో నిక్షిప్తం చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చేలా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీకి బాధ్యతలు అప్పగించారు.

**భక్తులకు మరింత చేరువగా..**



సుదూర ప్రాంతాల్లో ఉండే భక్తుల సమయం ఆదా చేసేందుకు, సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు.. ఇప్పటికే పలు సేవలను ఆన్‌లైన్ చేశాం. మరికొన్ని సేవలను ఆన్‌లైన్ చేయనున్నాం. ఇక స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా రామయ్యను భక్తులకు మరింత చేరువ చేయనున్నాం. త్వరలోనే యాప్ అందుబాటులోకి వస్తే భక్తులకు అరచేతిలో సమస్త సమాచారం లభిస్తుంది.

–ఎల్.రమాదేవి, రామాలయ ఈఓ

# ఆదరణలేని ‘విడిది’

- గోదావరి తీరంలో రివర్‌సైడ్ కుటీరాల ఏర్పాటు
- అద్దె ఎక్కువ ఉండటంతో ఆసక్తి చూపని పర్యాటకులు
- పర్యాటక ప్రోత్సాహానికి భారీగా చార్జీల తగ్గింపు



నదీ తీరంలో ఏర్పాటు చేసిన విడిది కుటీరాలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న భక్తులతోపాటు పర్యాటకులు గోదావరి నదీ తీరంలో బస చేసేలా విడిది (రివర్‌సైడ్ క్యాంప్) కుటీరాలు ఏర్పాటు చేశారు. ముక్కోటి సందర్భంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవతో ఏరు ఉత్సవాల్లో భాగంగా వీటిని అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, ఆదివాసీ పల్లె వాతావరణం తెలిసేలా మూడు చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. పర్యాటకులకు విందుతోపాటు వినోదం, జల విహారం చేసేలా సదుపాయాలు కల్పించారు. ఇందుకోసం పెద్దలకు రూ.6 వేలు పెద్దలకు, పిల్లలకు రూ. 2 వేలు చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. కాగా మొదటి విడత 18 మంది రాగా, తర్వాత 10 మంది మాత్రమే వచ్చారు.

**స్వయం సహాయ సంఘాలకు నిర్వహణ..!**

విడిది కుటీరాల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు డీఆర్‌డీఏ అధికారులు నిర్వహణ బాధ్యతలు చూశారు. అధికారులకు నిర్వహణ భారంగా మారడంతో, వారి పర్యవేక్షణలోనే స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు అప్పగించాలని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. పర్యాటకుల అభ్యర్థన మేరకు ఆదివాసీ వంటలు వడ్డించేలా, ఆసక్తి ఉన్న పర్యాటకులను చంద్రుగొండ మండలం బెండాలపాడు, దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప, పాల్వంచ మండలం కిన్నెరసాని, ఐటీడీఏ గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటు చేసిన గిరిజన పల్లె వాతావరణ ఆవాసాలను చూపించేలా చర్యలు తీసుకోనున్నారు.

**రూ.500కు తగ్గింపు**

ముక్కోటి అనంతరం మిగతా సందర్శక ప్రాంతాలతో సంబంధం లేకుండా విడిది కుటీరాల అద్దె పెద్దలకు రూ. 2000, పిల్లలకు రూ.1000గా నిర్ణయించారు. పర్యాటకులు 12 గంటలు బస చేసేలా మూడు రకాల కుటీరాలను ఏర్పాటు చేశారు. ముగ్గురు, నలుగురుతోపాటు ఫ్యామిలీ బస చేసే విధంగా సిద్ధం చేశారు. కానీ, అద్దె అధికంగా ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి పర్యాటకులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పెద్దలకు చార్జీ రూ.500, పిల్లలకు రూ.300గా నిర్ణయించారు. భోజనం కావాలనుకుంటే ప్రత్యేకంగా చెల్లించాలని నిబంధనలు పెట్టారు. కాగా ఆదరణ లేకపోవడంతో ముగ్గురు బస చేసే కుటీరాల్లో కొన్నింటిని తొలగించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎల్టా ‘ఐపాస్’ ను ఆవిష్కరించిన కలెక్టర్



ఐపాస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) రూపొందించిన ఆంగ్ల ఐపాస్ పుస్తకాన్ని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లంలో భయం పోగొట్టి అధిక మార్కులు సాధించేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఐపాస్ 2025 విద్యార్థుల కాపీని డీఈఓ వెంకటేశ్వరాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పుస్తకం ద్వారా విద్యార్థులు గ్రామర్‌పై పట్టు సాధించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ విద్యార్థులలో పోటీతత్వం పెంచేందుకు, స్కిల్స్ అభివృద్ధికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు.

**21న జిల్లా ఒలంపియాడ్ పరీక్ష**

పాత కొత్తగూడెంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 21న జిల్లాస్థాయి ఆంగ్ల ఒలంపియాడ్, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు ఎల్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ దస్తగిరి, షేక్ మీరాహుస్సేన్ తెలిపారు. మండల స్థాయి విజేతలు తమ టీచర్లతో కలిసి పోటీలకు రావాలని కోరారు.

# సాగు వనరులకు మరమ్మతులు..

- చెక్ డ్యామ్‌లు, లిఫ్టుల నిర్మాణానికి చర్యలు
- టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు



మాట్లాడుతున్న ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు

ఇల్లెందు: లిఫ్టులు, చెక్ డ్యామ్‌లు, చెరువులు, కుంటలు తదితర సాగు వనరుల మరమ్మతులకు, కొత్త నిర్మాణాలకు అంచనాలు రూపొందించాలని టీజీఐడీసీ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయబాబు సూచించారు. శుక్రవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఐడీసీ అధికారులతో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పలుచోట్ల లిఫ్టులు, చెక్ డ్యామ్‌లు నిర్మించాలని పలువురు రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తేగా, రెండు నెలల్లోపు సందర్శించి అంచనాలు రూపొందించాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సాగు నీటి పనులకు నిధులు సమకూరుస్తామని తెలిపారు. చెరువుల మరమ్మతులకు ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు కూడా వినియోగించుకోవచ్చన్నారు. అటవీశాఖతో కూడా ప్రతిపాదనలు రూపొందించాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగయ్యే అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ శ్రీనివాసాచార్యులు, డీఈలు భాగ్యరాజ్ రాథోడ్, కృష్ణ, రవికుమార్, ఏఈలు, పీఏసీఎస్ ఛైర్మన్లు మెట్టెల కృష్ణ, మూల మధుకర్‌రెడ్డి, మేకల మల్లిబాబుయాదవ్, దుర్గాప్రసాద్, పి.వీరభద్రం, సత్యనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, వైస్ ఛైర్మన్ సయ్యద్ జానీపాషా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోతు రాంబాబు పాల్గొన్నారు. అనంతరం మువ్వా విజయబాబును పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దానియేల్, పులి సైదులు సత్కరించారు.

# సెంట్రల్ పార్కుకు రూ.86 లక్షలు..

- హరిత నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- పార్క్‌లో సైకిల్ ట్రాక్, ఫెన్సింగ్ ఏర్పాటుకు ఖర్చు



కొత్తగూడెంలోని అర్బన్ సెంట్రల్ పార్క్

చుంచుపల్లి: జిల్లా కేంద్రం కొత్తగూడెం సమీపంలో ఉన్న అటవీశాఖ అర్బన్ పార్క్ (సీఎస్ఆర్ సెంట్రల్ పార్క్) పర్యాటకులను ఆకర్షిస్తోంది. నిత్యం వందలాది మంది ఇక్కడికి వచ్చి సేదతీరుతున్నారు. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో పార్కులో సందడి నెలకొంటోంది. సఫారీ బ్యాటరీ కారు, వాచ్ టవర్, కృత్రిమ కొలనులో బోటింగ్ సౌకర్యం, దండకారణ్యం గెస్ట్‌హౌస్, రకరకాల చెట్లు, వాకింగ్ ట్రాక్, యోగా పరికరాలు, చిన్నారుల ఆట వస్తువులు ఉండటంతో పట్టణవాసులు పార్కుకు వచ్చి ఆహ్లాదం పొందుతున్నారు. ఈ క్రమంలో పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ రూ. కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం హరిత నిధి నుంచి రూ.86 లక్షల మంజూరు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించింది. అర్బన్ పార్క్ నిర్వహణ బాధ్యతలను అటవీశాఖ చేపట్టగా, సందర్శకుల రాకతో రోజుకు రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదాయం వస్తోంది. ఆ మొత్తాన్ని ఆరుగురు సిబ్బంది జీతాలకు, ఇతర చిన్నపాటి ఖర్చులకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పార్కు చుట్టూ సైకిల్ ట్రాక్, ఫెన్సింగ్ నిర్మించనున్నారు. నూతన సైకిళ్లు కొనుగోలు చేయనున్నారు. దీంతో పార్కు మరింత సుందరంగా మారనుంది.

**కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల ప్రజలకు ఆహ్లాదం**

లక్ష్మీదేవిపల్లిలో సుమారు 240 ఎకరాల అటవీ స్థలంలో రూ.3.50 కోట్లతో 2017లో సెంట్రల్ పార్క్ ఏర్పాటు చేశారు. దివంగత అటవీ రేంజి అధికారి చలమల శ్రీనివాసరావు(సీఎస్ఆర్) మెమోరియల్ పార్క్‌గా అటవీ అధికారులు పేరుపెట్టారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆహ్లాదం, ఆటవిడుపు కోసం ఇక్కడికి సందర్శకులు వస్తున్నారు. విద్యార్థులకు పిక్నిక్ స్పాట్‌గా మారుతోంది. సాధారణ రోజుల్లో రోజుకు 250 మంది, సెలవు దినాల్లో 400 మంది వరకు సందర్శకులు వస్తున్నారు. పెద్దలకు రూ.20, చిన్నారులకు రూ.10, పిక్నిక్ అయితే రూ.1000, కెమెరా షూటింగ్‌లకు రూ.1000, వాకర్స్ ఏడాది సభ్యత్వానికి రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. పార్క్ నిర్వహణ, వసతుల కల్పనపై నిర్వాహకులు పర్యవేక్షిస్తున్నా ఇంకా కొన్ని సమస్యలు తీరాల్సి ఉంది. పిల్లల ఆట పరికరాల్లో చాలావరకు మరమ్మతులకు గురవ్వగా, మరికొన్ని కొత్త వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మరికొన్ని మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించాల్సి ఉంది.

**మరిన్ని వసతులు కల్పిస్తాం**



అర్బన్ పార్క్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపగా, మంత్రుల చొరవతో రూ.86 లక్షల నిధులు మంజూరయ్యాయి. సందర్శకులకు ఆహ్లాదంగా మారిన కొత్తగూడెం సెంట్రల్ పార్క్‌లో మరిన్ని వసతుల కల్పించేలా దృష్టి పెట్టాం. హరితనిధుల ద్వారా పార్క్ అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

–కిష్టాగౌడ్, డీఎఫ్ఓ

# ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి

**ఐటీడీఏ పీఓ రాహుల్**



రైతులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన రైతుల ఆధార్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఏజెన్సీ మండలాల ఏఈఓ, ఏఓలతో పెండింగ్‌లో ఉన్న గిరిజన రైతుల ఆధార్ సీడింగ్ జనరేట్‌పై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 862, ఖమ్మం జిల్లాలో 312 మంది రైతుల ఆధార్ సీడింగ్ పెండింగ్‌లో ఉందన్నారు. భద్రాచలం ఏజెన్సీ గిరిజన రైతులందరికీ రైతు భరోసా నిధులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పీఓ రాహుల్ తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ కమిషనరేట్ కార్యాలయం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం పనులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. చుట్టుపక్కల ఉన్న చెత్తను తొలగించాలని గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

**సోలార్ విద్యుత్‌తో సాగు అభినందనీయం**

కొత్తగూడెంరూరల్: సాగు నీటి బోర్లకు సోలార్ విద్యుత్ వినియోగించుకోవడం అభినందనీయమని పీఓ రాహుల్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక గ్రామపంచాయతీ రైతులు సోలార్ ప్లాంట్ల ద్వారా బోర్లకు విద్యుత్ సమకూర్చుకుని పంటలు సాగు చేస్తున్నారు. వారి పొలాలను శుక్రవారం పీఓ పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఓ డేవిడ్ రాజ్, మైనింగ్ ఏఈ రమేష్, రెడ్కో జీఎం అజయ్‌కుమార్, ఏఈ రఘురామయ్య, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, ఉదయ్ కుమార్, రమణయ్య, హరీష్, మునీర్ పాషా, చైతన్య, హరికృష్ణ, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సర్వే పారదర్శకంగా సాగాలి

టేకులపల్లి: పారదర్శకంగా సర్వే నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన అన్నారు. శుక్రవారం టేకులపల్లి మండలంలోని గొల్లపల్లి, సులానగర్, ముత్యాలపాడు క్రాస్ రోడ్డు, కోయగూడెం, టేకులపల్లి గ్రామాల్లో ఆమె ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. కోయగూడెంలో మునగతోటను పరిశీలించారు. సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ నర్సరీలను తనిఖీ చేశారు. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ అంగన్‌వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా డేటా ఎంట్రీ ప్రక్రియను తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ గడదాసు రవీంద్రారావు, శ్రీనివాస్, సిద్ధాంత చిట్టి, పవిత్ర, శ్వేత, తిరుపతయ్య, భీముడు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలకు స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ప్రభుత్వం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్ ద్వారా నిధులు విడుదల చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉమ్మడి జిల్లాలోని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలకు నిధులు విడుదల కాగా, అత్యధికంగా కేఎంసీకి రూ.2,22,42,610, అత్యల్పంగా ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.26,03,864 కేటాయించారు. ఈ నిధులను మున్సిపాలిటీల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణం, ఇతర నిర్మాణాలకు వినియోగించుకునే వీలుంది. అభివృద్ధి పనులు, ఇతర అవసరాలకు సైతం సర్దుబాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు.

**మున్సిపాలిటీల వారీగా విడుదలైన నిధులు (రూ.)**

| | |
|---|---|
| ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ | 2,22,42,610 |
| పాల్వంచ మున్సిపాలిటీ | 69,18,315 |
| కొత్తగూడెం | 60,15,757 |
| మధిర | 28,78,997 |
| వైరా | 28,22,803 |
| సత్తుపల్లి | 27,15,583 |
| మణుగూరు | 27,63,121 |
| ఇల్లెందు | 26,03,864 |

## క్లుప్తంగా

### 'డబుల్' ఆక్రమణ



డబుల్ బెడ్రూం నిర్మాణాలను ఆక్రమించుకున్న దృశ్యం

**దమ్మపేట:** మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులో నిర్మాణం పూర్తికాని డబుల్ బెడ్రూంలను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యాన ఆక్రమించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మల్లారం శివారులోని ప్రభుత్వ స్థలంలో 18 డబుల్ బెడ్రూంలను పిల్లర్ల వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. వీటిని మాస్‌లైన్ ఆధ్వర్యాన సుమారు 40 మంది పిల్లర్లపై టార్పాలిన్ పట్టాలు కప్పి ఇదిగో ఇలా ఆక్రమించుకుని ఆవాసాలుగా మార్చుకున్నారు.

### ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

**చర్ల:** పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గురువారం రాత్రి మావోయిస్టులు ఓ గిరిజనుడిని దారుణంగా హతమార్చారు. బీజాపూర్ జిల్లాలోని మిర్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల హల్లూరుకు చెందిన సుక్కూ హప్కా ఇంటికి గురువారం రాత్రి మావోయిస్టులు వచ్చి గొంతు కోసి హతమార్చారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందు వల్లే హతమార్చామంటూ మృతదేహం వద్ద మావోయిస్టులు ఒక లేఖను వదిలారు.

### చికిత్స పొందుతున్న యువకుడి మృతి



వెంకటేశ్వర్లు(ఫైల్)

**టేకులపల్లి:** పురుగు మందు తాగిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీకి చెందిన బానోత్ వెంకటేశ్వర్లు(27) తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితమే మృతి చెందడంతో బాబాయ్, పిన్నిల వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. కడుపులో నొప్పి తాళలేక గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బాబాయ్ శోభన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# వైభవంగా దొంగల దోపు ఉత్సవం

- విశ్రాంతిమండపంలో రామయ్యకు రాపత్తు సేవ
- 26న ఆలయంలో విశ్వరూప సేవ



స్వామి వారి సన్నిధిలో త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

**భద్రాచలం:** భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లోని రాపత్తు సేవలలో భాగంగా శుక్రవారం దొంగల దోపు ఉత్సవం వైభవోపేతంగా జరిగింది. తొలుత పల్లకీలో స్వామి వారిని మేళతాళాలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా విశ్రాంతి మండపం వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చాక.. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి హారతిని సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది పలు వేషధారణలతో దొంగల దోపు ఉత్సవాన్ని ఆసక్తిగా జరిపగా.. స్వామివారు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా, ఈ నెల 26వ తేదీన భద్రాచలంలో మాత్రమే ప్రత్యేకంగా జరిగే విశ్వరూప సేవను జరపనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**స్వర్ణ కవచధారులై దర్శనం..**

అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచ దారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు జరిపాక బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా శుక్రవావాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

**త్రిదండి రామానుజ జీయర్ పూజలు..**

శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శుక్రవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశారు. ఉపాలయాలలో పూజలు అనంతరం పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పీఆర్‌ఓ కత్తి శ్రీనివాస్, అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

## బొజ్జాయిగూడెంలో దొంగల హల్‌చల్..

విద్యుత్ సామగ్రి, సిలిండర్లు అపహరణ



ప్రభుత్వ పాఠశాలలో బీరువాలను పరిశీలిస్తున్న పోలీసులు

**ఇల్లెందురూరల్:** మండలంలోని బొజ్జాయిగూడెం పరిధిలో గ్రామపంచాయతీ కార్యాలయం, వైద్యశాఖ సబ్ సెంటర్, ప్రభుత్వ పాఠశాల మూడు చోట్ల ఒకే రోజు దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం రాత్రి జరిగిన చోరీ ఘటన వివరాలిలా ఉన్నాయి. మూడు ప్రభుత్వ కార్యాలయాలు ఒకే కాంపౌండ్‌లో ఉండడం .. అవి గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడంతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నింపాదిగా అక్కడకు చేరుకొని ముందుగా విద్యుత్ సరఫరాను కత్తిరించి స్విచ్‌బోర్డులను పూర్తిగా తొలగించారు. ఆతర్వాత బీరువాలను పగలగొట్టి స్టేషనరీ సామగ్రిని అపహరించారు. పంచాయతీ కార్యాలయంలో 200 మీటర్ల సర్వీసు వైరు, నూతనంగా కొనుగోలు చేసిన 20 వీధి దీపాలు, పాఠశాల, సబ్‌సెంటర్‌లో స్టౌ, సిలిండర్లు, సబ్‌సెంటర్‌లో నీటిశుద్ధి యంత్రానికి అమర్చిన విద్యుత్ మోటార్‌లను చోరీ చేశారు. శుక్రవారం ఉదయం విధులకు హాజరైన పంచాయతీ కార్యదర్శి జాన్‌పాషా తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని ఉన్నతాధికారుల అనుమతితో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసు సిబ్బంది మూడు కార్యాలయాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న టౌన్ పోలీసులు

**భద్రాచలంఅర్బన్:** గంగిరెద్దు వెనకాల ఆటాడుకుంటూ వెళ్లి తప్పిపోయిన ఓ బాలుడిని శుక్రవారం తల్లికి అప్పగించిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు గ్రామానికి చెందిన కుసుమ సంక్రాంతి పండగకు భద్రాచలం పట్టణంలోని లంబాడీకాలనీలో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం సదరు బాలుడు ఆ కాలనీకి వచ్చిన గంగిరెద్దు వెనకాల ఆటాడుకుంటూ వెళ్లి దారి మర్చిపోయి అదే కాలనీలో గల 4వ లైన్ వద్ద ఏడుస్తున్నాడు. ఈక్రమంలో అక్కడే పనిచేస్తున్న ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఆ బాలుడిని స్థానిక పోలీసులకు అప్పగించగా.. టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి వివరాలు సేకరించే క్రమంలో తన తల్లిపేరు కుసుమ అని మాత్రమే చెబుతున్నాడు. దీంతో ఎస్‌ఐ భద్రాచలం పట్టణానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో బాలుడి ఫొటోతో పాటు షేర్ చేస్తూ.. బాలుడి సమాచారం కోసం ఓ నంబర్‌ను సంప్రదించాలని తెలపడంతో 20 నిమిషాల తర్వాత బాలుడి తల్లి కుసుమతో పాటు పట్టణంలోని లంబాడీకాలనీకి చెందిన పలువురు ఎస్‌ఐ వద్దకు చెరుకోగా సదరు బాలుడిని తల్లికి అప్పగించారు.

## మున్సిపల్ కమిషనర్‌కు తప్పిన ప్రమాదం

**ఇల్లెందు/టేకులపల్లి:** ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పయనిస్తున్న కారుకు శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుంది. విధులు ముగించుకుని ఇల్లెందు నుంచి పాల్వంచ వెళ్తున్న క్రమంలో టేకులపల్లి మండలం రోళ్లపాడు క్రాస్ రోడ్డు దాటిన తర్వాత ఎదురుగా బొగ్గు లారీలు వస్తుండడంతో కారును రోడ్డు పక్కన ఆపాడు. ఈక్రమంలో ఓ లారీ ఓవర్‌టేక్ చేయబోయి కారును ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం ధ్వంసం కాగా కమిషనర్, కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం, చైర్మన్ డీవీ, మేనేజర్ అంకుషావళీలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్ వజ్జా కొండలుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోగుల సురేష్ తెలిపారు.

## ఫంక్షన్ హాల్ దగ్ధం



దగ్ధమైన ఫంక్షన్ హాల్

**పినపాక:** మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్‌లో గల జీవీఆర్ అనే ప్రైవేట్ ఫంక్షన్ హాల్ విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. యజమానులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల్లో వివాహ శుభకార్యం ఉన్నందున పనులు చేస్తున్న క్రమంలో ఏసీ దగ్గర షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో దానిలోని ఫర్నిచర్, సీలింగ్, డెకరేషన్ సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగాలి, సంఘటన స్థలాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి యజమాని గంగ్రాతి ప్రవీణ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. రామనాథం, నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శీను, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి



లక్ష్మీపురంలో సర్వే తీరును పరిశీలిస్తున్న అధికారులు

**బూర్గంపాడు:** అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా క్షేత్రస్థాయి పరిశీలన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని సోంపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపిక నిబంధనల ప్రకారం చేయాలన్నారు. తహసీల్దార్ ఎండీ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఏఓ శంకర్, ఆర్‌ఐ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటలో..**

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని నారంవారిగూడెం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల, రైతు భరోసా పథకానికి సంబంధించిన సర్వేను కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు తనిఖీ చేశారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, ఆర్‌ఐలు కృష్ణ, పద్మావతి పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ



భద్రాచలంఅర్బన్: శ్రీసాయి దంత వైద్యశాలను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

**భద్రాచలంఅర్బన్/పాల్వంచ:** భద్రాచలం, పాల్వంచ పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో శుక్రవారం డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని పలు ఆస్పత్రులతో పాటు ఇతర మెడికల్‌కు సంబంధించిన కేంద్రాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈనేపథ్యాన నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక నిర్వహిస్తున్న శ్రీసాయి సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలను సీజ్ చేశారు. వీలైనంత త్వరగా లోపాలను సరి చేసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాక ఆస్పత్రుల్లో బయో మెడికల్ వేస్ట్ లేకుండా చూడాలని, ఫీజు పట్టికను బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాకే క్లినిక్‌లు, ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆయుష్ క్లినిక్‌లు నడపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేసినట్లు ఫిర్యాదులు అందితే వారి క్లినిక్‌లు సీజ్ చేసి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ బాలాజీనాయక్ ఉన్నారు. కాగా, పాల్వంచ పట్టణంలో ఆస్పత్రిలో యూఎఫ్‌డబ్ల్యూసీ ఇమ్యూనైజేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బి.బాలాజీ నాయక్, ఎండీ.ఫైజ్ మొహిఉద్దీన్, సిబ్బంది పద్మ, కృప, రమాదేవి, సల్మ, శాంతలత పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా ఇద్దరు వ్యక్తులు ఒక ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. వారిని ఆపి తనిఖీ చేశారు. ఈక్రమంలో వారి వద్ద గంజాయి దొరకడంతో వారిరువురితో పాటు గంజాయి, సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. దీంతో వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన మల్లె శివ, శీలం మోహన్‌కృష్ణలుగా తెలిందని, 1.150 కేజీల గంజాయిని సీలేరు నుంచి భద్రాచలం మీదుగా గుంటూరుకు తరలిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు. ఈమేరకు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీష్, వెంకట్, విజయ్, హనుమంతరావు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి మృతిపై అనుమానాలు..

కేసు నమోదు

**పాల్వంచ:** ఓ చిన్నారి మృతి చెందిన ఘటనపై అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మంద సతీష్‌కు పాల్వంచ నవభారత్‌కు చెందిన రమ్యశ్రీతో 2020లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె నిక్షిత, 17 నెలల వయస్సు కల మేధశ్రీ సంతానం. రమ్యశ్రీ ఈనెల 9వ తేదీన పనికి వెళ్తానని ఇంటి వద్ద ఇద్దరు పిల్లలను వదిలేసి పాల్వంచలోని పుట్టింటికి వెళ్లింది. మరుసటి రోజైన 10వ తేదీన రమ్యశ్రీ తల్లి పద్మ వచ్చి ఇద్దరు పిల్లలను తీసుకెళ్లగా 16వ తేదీన మేధశ్రీ స్పృహ కోల్పోయిందని, ఆ కాసేపటికే పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిందని సతీష్‌కు తెలిపారు. అయితే, తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని ఆయన ఫిర్యాదు చేయడంతో శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సుమన్ తెలిపారు.














# హాబీస్.. హ్యాపీస్

కొంతమంది చిన్న చిన్న విషయాలకే ఆందోళన పడిపోతుంటారు. కొందరు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. సంతోషంగా ఉండటమనేది పూర్తిగా మన వ్యక్తిత్వం, అలవాట్ల పైనే ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటారు. వీళ్లు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషాన్ని దూరం చేసుకోరు. అదెలా సాధ్యం? సంతోషంగా ఉండే వారి అలవాట్లు ఏంటో తెలుసుకుందామా?





సంతోషంగా ఉండేవారు కుటుంబంతోనూ, స్నేహితులతోనూ ఎక్కువ సమయం గడపడటానికి ఇష్టపడతారని, వీరిని కష్టాలు, బాధలు చుట్టిముట్టినప్పుడు తమ కుటుంబం, స్నేహితులతోనే వాటిని పంచుకుంటూ మనసు తేలిక చేసుకుంటారన్నది హ్యాపీ పీపుల్ హ్యాబిట్స్‌లో బయట పడిన విషయం. వీరు తాము సంతోషంగా ఉంటూ, తమ కుటుంబాన్ని, స్నేహితులనూ కూడా సంతోషంగా ఉండేలా చూస్తారు.

**పొద్దున్నే నిద్రలేవడం**

సంతోషంగా ఉన్న వ్యక్తులు ఉదయాన్నే నిద్రలేస్తారు. పని ఉన్నా... లేకున్నా పొద్దున్నే లేవడం మానుకోరు. తమకు తాముగా కొన్ని నిబంధనలు, పరిమితులు విధించుకుని తమ రోజును ప్రారంభిస్తారు. అలాగే వ్యాయామం, ఆధ్యాత్మిక చింతన, కొత్త విషయాలను తెలుసుకోవడం, పరిశోధనలు, అధ్యయనం వంటి వాటితో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు.

**ధ్యానం**

సంతోషంగా ఉన్నవారు ధ్యానంలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. ధ్యానంతోనే తమ ప్రతికూల ఆలోచనలను నియంత్రిస్తారు. సానుకూలతను పొందడానికి ప్రయత్నిస్తారు. సంతోషకరమైన, స్వీయ–అవగాహన ఉన్న వారికి ధ్యానం ఒక ముఖ్యమైన అలవాటు.

**ప్రకృతిలో గడపడం**

ఎప్పుడూ సంతోషంగా ఉండేవారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతోపాటు ప్రకృతితో మంచి సమయాన్ని గడపడాన్ని ఇష్టపడతారు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. నకారాత్మక ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. అలాగే తమతో తాము మరింతగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.



**ఆరోగ్యకరమైన ఆహారం**

సంతోషంగా ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినడానికి ప్రయత్నిస్తారు. అలాగే ప్రతిరోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తో పాటు తగినన్ని నీటిని తాగుతారు.



**కంటినిండా నిద్ర**

మన శరీరానికి నిద్ర చాలా చాలా అవసరం. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల రాత్రి నిద్ర చాలా అవసరం. నాణ్యమైన నిద్ర మనసును సంతోషంగా ఉంచుతుంది. తగినంత నిద్ర లేనివారు చికాకు పడుతూ చిర్రుబుర్రులాడటం చూస్తూనే ఉంటాం.

**కనీస వ్యాయామం**

ఎప్పుడు చూసినా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండేవారు శరీరానికి, మెదడుకూ కూడా తగినంత వ్యాయామం కల్పిస్తారని పరిశోధనలలో తేలింది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ కనీసం వాకింగ్, రన్నింగ్, జాగింగ్, తేలికపాటి బరువులు ఎత్తడం, లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లెక్కడం, గార్డెనింగ్ వంటి శారీరక వ్యాయామంతోపాటు మెదడును పదును పెట్టే చెస్, బిజినెస్, క్రాస్‌వర్డ్స్ పూరించడం, సుడోకు వంటి వాటిలో పాల్గొనడం వల్ల సంతోషంగా ఉండగలరు.

అంటే మన అలవాట్లు... అదేనండీ.. హాబీసే... హ్యాపీస్ అన్నమాట. కాబట్టి మంచి అలవాట్లతో మరింత సంతోషంగా జీవిద్దాం.

## లైఫ్@360

• ప్లీజ్ క్లీన్

# వాడ్తర్ బాటిల్



ఒకప్పుడు ప్రయాణాలలో మాత్రమే వెంట తీసుకెళ్లే వాటర్ బాటిల్స్‌ని ఇప్పుడు మనం పని చేసే సిస్టమ్ పక్కన లేదా మంచం పక్కన పెట్టుకోకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేందుకు వీలుగా వాటర్ బాటిల్స్‌ని దగ్గర పెట్టుకోవడం వరకు తప్పేం లేదు కానీ, వాటిని సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల వాటి మీద మిలియన్లకొద్దీ సూక్ష్మజీవులు పేరుకుని పోయి రకరకాల జబ్బులు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య, ఆరోగ్య పరిశోధకులు.

తాళం చెవులు, సెల్‌ఫోన్, మనీపర్స్, హ్యాండ్ బ్యాగ్‌లాగే వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకునిపోయే అవసరంగా మారింది. అయితే కొన్ని పరిశోధనల ప్రకారం తేలిందేమిటంటే, వాటర్ బాటిల్‌ను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల టాయిలెట్ సీట్ మీద కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు సూక్ష్మజీవులు, బాటిల్ మీద, లోపల, మూత మీద బ్యాక్టీరియా పేరుకుపోతుందట. మనం ఇప్పుడు చెప్పుకోబోయే విషయాలు వినడానికి కొంచెం వింతగా... మరి కొంచెం బాధాకరంగా కూడా ఉండచ్చు. అయినా, చెప్పుకోక తప్పదు మరి!

స్ట్రా ద్వారా తాగే బాటిల్స్, సిప్పర్ బాటిల్స్, అలాగే నోటికి కరిపించుకుని తాగే బాటిల్స్... ఈ మూడు రకాల బాటిల్స్‌లోనూ రెండు రకాలైన బ్యాక్టీరియాను కనుగొన్నారు పరిశోధకులు. ఈ బ్యాక్టీరియా టైఫాయిడ్‌ను కలిగిస్తుంది. అందువల్ల తిరిగి వాడే వాటర్ బాటిల్స్‌ను తీరుబడిగా వారానికోసారి కాకుండా ప్రతిరోజూ సబ్బునీటితో, వేడి నీటితో శుభ్రంగా కడిగి ఉపయోగించడం చాలా మంచిది లేదంటే వ్యాధుల బారిన పడటం ఖాయం మరి!

• యోగా

# వెన్నునొప్పి నివారణకు గోముఖాసన

ఆవు ముఖ భంగిమను పోలి ఉంటుంది కాబట్టి దీనికి గో ముఖాసన అని పేరు. శరీరం మొత్తం స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు ఒకదానికి మీద ఒకటి చేరే ఈ ఆసనం చూడ్డానికి ఆవు ముఖంలా కనిపిస్తుంది. చేతులు ఆవు ముఖం చెవులను సూచిస్తాయి.

**ఇలా చేయాలి..**

- ముందుగా సౌకర్యంగా చాప మీద కూర్చోవాలి. ఎడమ కాలును మోకాలి వద్ద వంచుతూ కుడి తుంటి భాగానికి దగ్గరగా తీసుకువెళ్లాలి.
- మోకాళ్లు ఒకదానిపై ఒకటి ఉండేలా సెట్ చేయాలి.
- కుడి చేతిని పైకి లేపి, మోచేయి వద్ద వంచి, వీపు కిందకు ఉంచాలి.
- ఎడమ చేతిని వీపు వెనకకు తీసుకువెళ్లి, కుడి చేతిని పట్టుకోవడానికి ప్రయత్నించాలి.
- రెండు చేతులు కలవకపోతే ఆ ఖాళీని భర్తీ చేయడానికి టవల్ లేదా స్కార్ఫ్‌ను ఉపయోగించాలి.
- వెన్నెముకను నిటారుగా ఉంచి, కూర్చోవాలి.
- దీర్ఘ శ్వాస తీసుకొని, వదులుతూ సౌకర్యంగా అనిపించేంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- మెల్లగా కాళ్లు, చేతులు విడదీసి యథాస్థితికి రావాలి. రెండోవైపు పై విధంగానే చేయాలి.

**ప్రయోజనాలు..**

డెస్క్ ఉద్యోగాలు చేసేవారిలో బ్యాక్ పెయిన్, హిప్ స్ట్రెస్ సాధారణంగా గమనిస్తుంటాం. వెన్నెముక స్ట్రెచ్ అవ్వడం వల్ల బ్యాక్‌పెయిన్ సమస్య తగ్గుతుంది. తుంటి, రక్తప్రసరణ, కీళ్ల కదలికలు మెరుగవుతాయి. దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

వెన్ను, మోకాలు గాయాలు ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవాలి. కింద కూర్చోనేటప్పుడు కుషన్‌ను కాలు మడతల్లో ఉంచవచ్చు. తుంటి నొప్పి వస్తుంటే సాధారణ సుఖాసనలో కూర్చొని కూడా ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.




# చెప్పుకోదగ్గ విశేషం



పాదరక్షలు సురక్షితమైన నడకకు అత్యవసరాలు. పాదరక్షల ప్రయోజనం అక్కడికే పరిమితం కాలేదు. ఫ్యాషన్‌రంగంలోనూ పాదరక్షల పాత్ర పెరుగుతూ వస్తోంది. ఫ్యాషన్ స్థాయిని దాటిన అల్ట్రాలగ్జరీ పాదరక్షలు లేటెస్ట్ ట్రెండ్. ఈ పాదరక్షలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా రికార్డులకెక్కాయి. వీటిని కొనాలంటే, ఒక మోస్తరు సంపన్నుల ఆస్తులు కూడా చాలవు. ఇవి 'మూన్ స్టార్ షూస్'. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గౌరవార్థం ఇటాలియన్ డిజైనర్ ఆంటోనియో వీట్రీ వీటికి రూపకల్పన చేశారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపించేలా రూపొందించిన ఈ పాదరక్షల ఖరీదు 19.9 మిలియన్ డాలర్లు. అంటే, రూ.164 కోట్లు. ఈ పాదరక్షల జత తయారీకి బంగారం, వజ్రాలతో పాటు గ్రహాంతర పదార్థాన్ని కూడా ఉపయోగించారు. అందుకే వీటి ధర అంతరిక్షాన్ని తాకే స్థాయిలో ఉంది. ఈ పాదరక్షల అడుగుభాగాన్ని తెల్లబంగారంతో తయారు చేశారు. పైభాగాన్ని పూర్తిగా మేలిమి బంగారంలో 30 కేరట్ల వజ్రాలను పొదిగి తయారు చేశారు. వీటి తయారీ లో క్రీస్తుశకం 1576లో అర్జెంటీనాలో రాలిపడిన ఉల్క నుంచి సేకరించిన పదార్థాన్ని కూడా ఉపయోగించడం విశేషం.

## సాక్షి సినిమా

# మంచి మాట వినాలి



• పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన 'హరి హర వీరమల్లు' నుంచి 'మాట వినాలి..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి... మాట వినాలి... మంచి మాట వినాలి...' అంటూ సాగే ఈ పాటని పవన్ కల్యాణ్ పాడారు. ఈ పాటను పెంచల్ దాస్ రాశారు. ఈ చిత్రం ఐదు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ వెర్షన్‌లోనూ రిలీజ్ చేశారు.



• ప్రియాంకా చోప్రా

# లాస్ ఏంజెల్స్ టు హైదరాబాద్

ప్రముఖ హీరోయిన్ ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. అందులో విషయం ఏముందీ అనుకోవచ్చు. సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌తో పెళ్లి తర్వాత అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు ప్రియాంక. ఇప్పుడు ఇలా హైదరాబాద్‌లో అడుగుపెట్టడానికి కారణం ఏంటి? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసమే ఆమె భాగ్యనగరానికి చేరుకున్నారని టాక్. ఈ చిత్రంలో మహేశ్‌బాబుకి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో ప్రియాంకా చోప్రా, కియారా అద్వానీ, ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ప్రియాంకా చోప్రాని కథానాయికగా ఫిక్స్ చేశారని భోగట్టా. ప్రియాంకా చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి హైదరాబాద్‌కి చేరుకోవడంతో ఈ మూవీ చిత్రీకరణ కోసమే ఆమె వచ్చారనే రూమర్లు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్త ఎంతవరకూ నిజమో తెలియాల్సి ఉంది.



• 'దిల్' రాజు, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్ రావిపూడి, శిరీష్

# ఇది తెలుగు ప్రేక్షకుల విజయం

- వెంకటేశ్

''కష్టపడి పని చేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయమే కాదు.. ఇంత గొప్పగా సపోర్ట్, లవ్ చేసిన తెలుగు ఆడియన్స్, ఫ్యాన్స్ సక్సెస్. ఇది తెలుగు ప్రేక్షకుల విజయం'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పొంగల్ బ్లాక్ బస్టర్ జాతర సెలబ్రేషన్స్'లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ అనిల్, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు, సినిమా యూనిట్‌కి థ్యాంక్స్. ఫిల్మ్ ఇండస్ట్రీలోని అందరూ మనస్ఫూర్తిగా ఫోన్ చేసి సినిమా బాగుందని అభినందిస్తున్నందుకు ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''మేము ఊహించినదానికంటే సినిమాని ఎక్కువ స్థాయికి తీసుకెళ్లిన తెలుగు ప్రేక్షకులకు నా పాదాభివందనాలు. ఈ సినిమాతో నా కెరీర్‌లో ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు... ఆడియన్స్ సపోర్ట్ లేకపోతే నాకు ఈ విజయం వచ్చేది కాదు'' అన్నారు. ''వెంకటేశ్‌గారు నిర్మాతల బాగు కోరుకుంటారు. కాబట్టే ఇప్పటికీ కాలర్ ఎగరేస్తూ ముందుకు వెళ్తున్నారు'' అని శిరీష్ పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అనిల్, వెంకటేశ్‌గారి కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'' అని చెప్పారు. ''నేను చేసిన భాగ్యం పాత్ర క్రెడిట్ అంతా అనిల్‌గారికే దక్కుతుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేశ్. ఈ వేడుకలో నటులు అవసరాల శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్లమాని, మురళీధర్ గౌడ్, కెమెరామేన్ సమీర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, రచయితలు అజ్జు మహాకాళి, నాగ్, సాయి కృష్ణ తదితరులు మాట్లాడారు.

# ఆహా ఏమి రుచి...





• చేపల కూర వండుతున్న నాగ చైతన్య

కట్టెల పొయ్యి వెలిగించారు నాగ చైతన్య. ఎందుకంటే చేపల పులుసు వండటానికి. వండాక అందరికీ వడ్డించారు కూడా. అందరూ 'బాగుంది' అని మెచ్చుకుంటూ, పుల్లుగా లాగించేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ చైతన్య ఇలా చేపల కూర వండటానికి కారణం ఏంటంటే... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికే. 'తండేల్' చిత్రంలో ఈ హీరో మత్స్యకారుడి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. విశాఖపట్నం, శ్రీకాకుళం తీర ప్రాంతాల్లోనూ ఈ చిత్రం షూటింగ్ జరిపారు. కాగా, 'మీ స్టయిల్‌లో చేపల కూర వండి పెడతా' అని విశాఖలో చిత్రీకరణలో పాల్గొన్నప్పుడు నాగచైతన్య అన్నారట. అన్నట్లుగానే చేపల కూర వండారు. కూర వండాక, అర చేతిలో కాస్త పులుసు వేసుకుని, రుచి చూసి, పక్కనే ఉన్న అమ్మాయికి ఇస్తే, 'బాగుందండి...' అని ఆమె అనడం, ఆ తర్వాత చైతు అక్కడ ఉన్నవారికి పులుసు వడ్డించి తాను కూడా తినడం వంటివన్నీ చిత్రీకరించి, ఆ వీడియోను షేర్ చేసింది చిత్రబృందం. ఇక ఆ వీడియోలో 'బాగుందా' అని చైతన్య అడగ్గా... ఆహా ఏమి రుచి అనే టైపులో 'బాగుంది.. చాలా బాగుంది' అంటూ అక్కడివాళ్లు తింటుంటే... 'పక్కానా... బాగోకపోతే ఏమీ అనుకోమాకండి... ఫస్ట్ టైమ్' అంటూ, వాళ్లతో కలిసి తానూ తిన్నారు చైతన్య. ఇక శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల జీవిత కథతో రూపొందుతున్న 'తండేల్'లో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది.

# శివరాత్రికి థ్రిల్



• ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. తెలుగు విడుదల హక్కులను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. గతంలో శివరాజ్ కుమార్ హీరోగా నటించిన 'వేద' చిత్రాన్ని ఆయన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ– ''హారర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రాక్షస'. మా సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు.

# వెరైటీ యాక్షన్



• సత్య

సత్య వినుగొండ, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ పై సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ ఆవిష్కరించారు. సత్య వినుగొండ మాట్లాడుతూ– ''వెరైటీ యాక్షన్ నేపథ్యంలో సాగే ఫన్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు.

# నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా...



• సోనూగా... లైలాగా విశ్వక్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'చూసుకో... అయ్యయ్యో నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా', 'మనకు తెల్లగ జేసుడే కాదు... తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ సేన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''రొమాంటిక్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'లైలా'. ఈ మూవీలో మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా విశ్వక్ సేన్ కనిపించే రెండు డిఫరెంట్ లుక్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి'' అని యూనిట్ పేర్కొంది.

# సుకృతి నటన చూసి షాక్ అయ్యాను

- సుకుమార్



• నవీన్, రవిశంకర్, సుకుమార్, సుకృతి, తబితా సుకుమార్, పద్మావతి, శేష సింధూరావు

''నా కుమార్తె సుకృతికి చిన్నప్పటి నుంచి పాడటం అంటే చాలా ఇష్టం. కానీ, నటన మీద పెద్దగా ఆసక్తి లేదు. తను నటిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు కలిసి సుకృతిని నటించేందుకు ఒప్పించారు. 'గాంధీ తాత చెట్టు'లో సుకృతి నటన చూసిన తర్వాత షాక్ అయ్యాను.. అంత బాగా నటించింది'' అని డైరెక్టర్ సుకుమార్ తెలిపారు. ఆయన కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ భార్య తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం సుకృతి లైఫ్‌లో మంచి జ్ఞాపకంలా మిగిలిపోతుంది. వినోదం, సందేశం ఉన్న 'గాంధీ తాత చెట్టు'ని అందరూ ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ పిల్లలతో కలిసి చూడాలి'' అన్నారు యలమంచిలి రవిశంకర్. ''ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. ''షూటింగ్‌లో తొలి రోజు సుకృతి నటన చూసి హ్యాపీ ఫీలయ్యాను'' అని తబితా సుకుమార్ పేర్కొన్నారు. ''ఒక చెట్టుకు, మనిషికి మధ్య ఉన్న అనుబంధంతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పద్మావతి మల్లాది. ''ఈ సినిమా కోసం నాన్న (సుకుమార్) ఎటువంటి సలహాలు ఇవ్వలేదు'' అని సుకృతి బండ్రెడ్డి తెలిపారు.